క్లుప్తంగా

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి



ఏలేశ్వరం భవిత కేంద్రంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంఈఓ-2 వరలక్ష్మి

ఏలేశ్వరం: ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ–2 బి.వరలక్ష్మి సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం డౌన్ సింద్రోమ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల మానసిక ప్రవర్తన బట్టి వారి అవసరాలు గుర్తించాలన్నారు. వారికి చదువుపై ఏకాగ్రత కలిగే చర్యలు తీసుకోవాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం తల్లిదండ్రులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు మేఘన, భవిత టీచర్లు వాణిపద్మజ, బుజ్జి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయానికి ధూపదీప నైవేద్య పథకం వర్తింపు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట నెహ్రూ కాలనీలోని బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి ధూపదీప నైవేద్య పథకం వర్తింపజేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు దేవదాయ, ధర్మాదాయ శాఖ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కృషితో ఆలయానికి ఈ పథకం వర్తించిందని, ప్రతి నెలా ఆలయానికి రూ.10,000 నిధుల వస్తాయన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి రాజీవ్ ప్రసాద్ శర్మ, కమిటీ సభ్యులు లైన్ డాక్టర్ నక్క సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు బొడ్డు సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: వీరవరంలో వేంచేసిన వనదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకులు సూర్యదత్త, మోహన్‌దత్త ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆదిత్యలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్–2025 కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించినట్టు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామరాజు, యానాం జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు. 2047 నాటికి భారతదేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని, అందుకు యువత ముందు ఉండాలని వైస్ చాన్సిలర్ ఎంబీ శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ కిషోర్ దూలం, జేఎస్‌టీయూకే కో ఆర్డినేటర్ జి.శ్యామ్ కుమార్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి. వెంకటేశ్వర్రావు, ప్రో వైస్ చాన్సలర్ రమశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్ పాల్గొన్నారు.

భూ ఆధార్ నమోదుపై అవగాహన



తొండంగిలో భూఆధార్ నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ నరసింహం

తొండంగి: మండలంలో వ్యవసాయ భూమి కలిగిన రైతులంతా భూ ఆధార్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రైతులకు భూ ఆధార్ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 9670 మంది భూమి కలిగిన రైతులు ఉండగా, ఇప్పటి వరకూ 7816 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులుంతా ఈ నెలాఖారులోపు గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లును సంప్రదించి భూ–ఆధార్ నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు, ఏఈఓ కొప్పన దైవప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

తుని: పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ పనుల కారణంగా పట్టణ పరిధిలోని 1 నుంచి 10 వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తుని పట్టణానికి మంచినీటి సరఫరా చేస్తున్న తుని మండలం రేఖవానిపాలెం పంపింగ్ ప్రధాన పైపులైన్ పక్కకు మార్పు చేసి కొత్త లైన్ వేయాల్సి ఉందన్నారు. దీంతో శనివారం నుంచి ఈ నెల 28 వరకూ టైలర్స్‌కాలనీ, డ్రైవర్స్ కాలనీ, నెహ్రూ నగర్ మెరక ప్రాంతంతో పాటు 1 నుంచి 10 వార్డులకు తక్కువ నీటి సరఫరా ఉంటుందన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు.

పంపాకు ఏలేరు జలాలు

- పోలవరం కాలువ పనులకు ఇబ్బంది లేకుండా తరలించేందుకు చర్యలు
- అంచనాలు రూపొందించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశం

అన్నవరం: పోలవరం కాలువ అక్విడెక్ట్ పనులకు ఇబ్బంది లేకుండా ఏలేరు నీటిని పంపాకు పైపుల ద్వారా తరలించేందుకు ఎంత ఖర్చు అవుతుందో అంచనాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పోలవరం అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 12న పంపా నదిలో జరిగే శ్రీరాముని చక్రస్నానం, మే 12న జరుగనున్న సత్యదేవుని చక్రస్నానం కార్యక్రమాలకు, దేవస్థానంలో నీటి సమస్య పరిష్కారానికి ఏలేరు నుంచి పంపాకు నీటిని విడుదల చేయాలని జిల్లా కలెక్టర్‌కు దేవస్థానం అధికారులు లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనిపై గత మంగళవారం జిల్లా కలెక్టర్ అన్నవరంలో పంపా నది, పోలవరం అక్విడెక్ట్ పనులను పరిశీలించారు. కాగా శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇరిగేషన్, పోలవరం, దేవస్థానం అధికారుల సమావేశంలో పంపా నీటి సమస్య పరిష్కారంపై ఆయన చర్చించారు. పోలవరం పనులకు ఆటంకం లేకుండా అక్విడెక్ట్‌కు వంద మీటర్ల దూరం నుంచి పంపా వరకూ పైప్‌లైన్ వేయడానికి సుమారు రూ.40 లక్షలు ఖర్చవుతుందని పోలవరం అధికారులు తెలిపారు. సుమారు అర కిలోమీటర్ దూరం పైపులు వేయాల్సి ఉంటుందన్నారు. కాగా తొలుత అంచనాలు రూపొందించాలని, ఆ తరువాత చర్చిద్దామని కలెక్టర్ సూచించారు. దేవస్థానంలో మంచి నీటి సమస్య పరిష్కారానికి గాను పంపా నదికి ఏలేరు నీరు విడుదల చేయడం అత్యవసరమని, దీని కోసం పోలవరం పనులను ఆపివేయాల్సి వచ్చినా వెనుకాడేది లేదని కలెక్టర్ స్పష్టం చేసినట్లు అధికారులు తెలిపారు.

దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు సోమవారం మళ్లీ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆరోజు పూర్తి సమాచారంతో రావాలని ఆయన పోలవరం అధికారులను ఆదేశించారు. సమావేశంలో పోలవరం ఈఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, దేవస్థానం ఈఈ నూకరత్నం, ఎలక్ట్రికల్ డీఈ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఏలేరు నుంచి పంపాకు నీరు వచ్చే మార్గంలో నిర్మిస్తున్న పోలవరం అక్విడెక్ట్

పంపా గర్భంలో రెండు కొత్త బోర్లు

అన్నవరం దేవస్థానంలోని సత్యగిరిపై గల సత్రాలకు నీటి సరఫరాకు గాను గిరిప్రదక్షిణ రోడ్డు దిగువన పంపా నదీ గర్భంలో రెండు బోర్‌వెల్స్ తవ్వుతున్నారు. ఈ పనులను ఈఓ వీర్ల సుబ్బారావు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. రూ.పది లక్షల వ్యయంతో ఈ బోర్లు వేస్తున్నారు. ఇక్కడ నీరు లభ్యమైతే అక్కడ నుంచి కొండల మీదుగా సత్యగిరికి పైప్‌లైన్ వేసి నీటిని తరలించనున్నారు. ఈ బోర్‌వెల్స్ మోటార్లకు సత్యగిరి నుంచి స్తంభాలు వేసి విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తెలిపారు.

టెన్త్ పరీక్షలకు 11 మంది గైర్హాజరు

ప్రత్తిపాడు: మండలంలో శుక్రవారం జరిగిన పదో తరగతి ఇంగ్లిషు పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలోని లంపకలోవ పరీక్ష కేంద్రంలో 242 మందికి 237 మంది, ప్రత్తిపాడు పరీక్ష కేంద్రంలో 190 మందికి 187 మంది, ఒమ్మంగి ఎ కేంద్రంలో 200 మందికి 199 మంది, ఒమ్మంగి బి కేంద్రంలో 92 మందికి 92 మంది, ధర్మవరం పరీక్ష కేంద్రంలో 125 మందికి 123 మంది వెరసి 849 మందికి 838 మంది పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు వసతులు కల్పించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

గోకవరం: మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. మండలంలో గోకవరం, రంపయర్రంపాలెం, కామరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూళ్లు, భూపతిపాలెం బాలుర గురుకుల పాఠశాల, వీరలంకపల్లిలోని వెలుగు బాలికల ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో ఇంగ్లిషు పేపర్‌కు 744 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 737 మంది హాజరైనట్టు ఎంఈఓ చిమ్మ రాజుదొర తెలిపారు. గోకవరం పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశారు. విద్యార్థులు తరగతి గదిలో సక్రమంగా కూర్చోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ నాతి బుజ్జి, ఎంఈఓ కేహెచ్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 493 మంది విద్యార్థులకు గాను 486 మంది పరీక్షలకు హాజరైనట్టు తెలిపారు. మండల పరిధిలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని చెప్పారు.

న్యాయవాదుల నిరసన

ప్రత్తిపాడు: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో శుక్రవారం న్యాయవాదులు నిరసన చేపట్టారు. న్యాయవాద పరిరక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత శివ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలో నిరసన తెలిపి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుగత శివ మాట్లాడుతూ ప్రధానంగా రాజకీయ కేసులు, మానవ హక్కుల కేసులను వాదిస్తున్న న్యాయవాదులపై సంఘ విద్రోహశక్తులు, పోలీసులు, ముఠాల నుంచి దాడులు జరుగుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో ఈ దాడులు మితిమీరాయన్నారు. కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లో మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం కూడా న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని, న్యాయవాదుల హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐలాజ్ రాష్ట్ర కోశాధికారి అవసరాల దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, పలివెల నాగేంద్రరాజు, సీనియర్ న్యాయవాది బండారు నరసింహరావు, ఐలాజ్ నాయకులు జోగా ప్రసాద్, జిగటాల కిషోర్, న్యాయవాద గుమస్తాలు చండిక బాబి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అవగాహన సదస్సులతో విద్యార్థులకు మేలు

గండేపల్లి: అవగాహన సదస్సులు ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉపయోగకరమని ఆదిత్య డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మెటీరియల్స్, ఎనర్జీ సైన్స్ (ఐసీఎంఈఏస్–2025) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నూతన ఆవిష్కరణల గురించి తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ వై.రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. థర్మల్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ అకడమిక్స్ ఎస్. రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ రవి

హిజ్రాల కొవ్వొత్తుల ర్యాలీ



తునిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

తుని/శంఖవరం: అనకాపల్లిలో హిజ్రా దీపును దారుణంగా హత్య చేసిన నిందితుడు బన్నీకి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తుని పట్టణం, శంఖవరం మండలం కత్తిపూడిలో హిజ్రాలు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జీఎన్‌టీ రోడ్డు నుంచి గొల్ల అప్పారావు సెంటర్ వరకూ ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘనటలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు హిజ్రాలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళనలు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో డ్రైవర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం 28వ రోజు కొనసాగాయి. జేఏసీ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ఉద్యోగులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎస్వీ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ధర్నాలు చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్వీ రమణను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్‌పీరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తుని: ఇటీవల రైలు ప్రమాదంలో గాయపడిన పసగడుగుల సత్యనారాయణ (50) శుక్రవారం మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. పాయకరావుపేట రాజీవ్ కాలనీకి ఎదురుగా ఉన్న రైల్వేగేటు సమీపంలో పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు సత్యనారాయణను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడు అనకాపల్లి జిల్లా పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అని, మృతుడు భార్య చనిపోవడంతో కొంత కాలం స్వగ్రామంలో టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు. తుని మండలం డి.పోలవరంలోని బంధువుల ఇంటికి వేళ్లేందుకు వచ్చిన సమయంలో ప్రమాదం జరిగిందని తెలిపారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

తుని: సామాజిక సేవలో ప్రజలు భాగస్వాములు కావాలని జేసీఐ జాతీయ వైస్ ప్రెసిడెంట్ ప్రజిత్ అన్నారు. శుక్రవారం తునిలో పర్యటించిన ఆయన గొల్ల అప్పారావు సెంటర్లో జేసీఐ వ్యవస్థాపకులు హెన్రీ గిబర్సన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇటీవల అకాల మరణం చెందిన జేసీఐ ప్రతినిధి చోడిశెట్టి హేమశంకర్ కుటుంబ సభ్యులను కలిసి ప్రగాడ సంతాపాన్ని తెలిపారు. జోనల్ చైర్మన్ సంతోష్, రాజీవ్, సంపత్, సాగర్, ప్రనీత్, మొగలపల్లి గుప్త, కార్తిక్, సంతోష్, కృష్ణ, విజయ్, కార్తీక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే ఆపాలి

శంఖవరం: మాలలు, మాదిగలను విభజించి పరిపాలించాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని, వెంటనే ఎస్సీ వర్గీకరణ ఆపాలని ప్రత్తిపాడు నియోజకవర్గ బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు గునపర్తి అపురూప్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎస్సీ కాలనీలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాని వినతి పత్రం అందజేశారు. పలువురు దళిత నేతలు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఏలేశ్వరం: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ రోడ్డులోని మసీదులో ముస్లింలకు విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు దిలబర్‌హుస్సేన్, అక్బర్ అలీఖాన్, పార్టీ నాయకులు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, శిడగం వెంకటేశ్వరరావు, పైల విజయ్‌కుమార్, జువ్విన వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ

జగ్గంపేట: గ్రామంలో శుక్రవారం మాదక ద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేసి డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నుంచి యువతను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలిపేందుకు ఇలాంటి ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోస్టర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ బాలరాజు, అకడమిక్ కో ఆర్డినేటర్ విశ్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

గోకవరం: మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా శుక్రవారం గోకవరం ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి దేవీచౌక్, ఆంజనేయ స్వామి గుడిసెంటర్, పోలీస్‌స్టేషన్, పాతబస్టాండ్ మీదుగా పంచాయతీ కార్యాలయం వరకు ప్రధాన రహదారిపై స్థానిక యువకులతో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటాం, డ్రగ్స్ వద్దు..ఆరోగ్యం ముద్దు అంటూ యువకులు నినాదాలు చేశారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉంటామని యువకులతో ఎస్సై ప్రతిజ్ఞ చేయించారు.



గోకవరంలో యువకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై పవన్‌కుమార్

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కనకదుర్గ అమ్మవారికి నేడు చండీహోమం

కొండ దిగువన తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం మూల సందర్భంగా శనివారం చండీహోమం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొనవచ్చునని అధికారులు తెలిపారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

తొండంగి: మండలంలోని దానవాయిపేట బీచ్ రోడ్డులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు మడదా ప్రభాకరరావు తెలిపారు. ఈ నెల 19న ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు ఆలయ ప్రధానార్చకులు శంకరణం వెంకటరాజుశర్మ పంచామృతాభిషేకాలు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన మహిళలు సాహూహిక తులసి పూజ నిర్వహించారు. కాగా శనివారం ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్యప్రదర్శన, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.



దానవాయిపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక తులసి పూజ చేస్తున్న భక్తులు

మైనర్లకు కౌన్సెలింగ్



కోటనందూరులో మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: నిర్లక్ష్యం, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లకు శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ఎస్సై టి.రామకృష్ణ కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత, నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం చేస్తూ పిల్లలను బైక్ డ్రైవింగ్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య కళాశాలలో డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్‌పై బిటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసినట్టు ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజైన్ థింకింగ్ ప్రాముఖ్యత విద్యార్థులకు వివరించినట్టు చెప్పారు. ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎం.రవీంద్ర, బి.రజని పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ శివజ్ఞానం దంపతులకు ఆశీస్సులు అందజేస్తున్న వేద పండితులు

అన్నవరం: మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శివజ్ఞానం కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం కాకినాడ జిల్లా అన్నవరంలో రత్నగిరిపై సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. వారికి ఆలయం వద్ద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేదాశీస్సులు, సత్యదేవుని చిత్రపటం, ప్రసాదాలను అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ఏఈఓ కృష్ణారావు అందజేశారు.

నేడు దాడిశెట్టి రాజా జన్మదిన వేడుకలు

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్లో శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ లగుడు శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు కేక్ కటింగ్ అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భవన నిర్మాణానికి స్థల పరిశీలన

రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ శాశ్వత భవన నిర్మాణానికి ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం స్థల పరిశీలన చేశారు. స్థానిక తహసీల్దార్ నరేష్, ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఆర్ఐ దినేష్ పటానాయక్‌తో కలసి ఆయన రౌతులపూడిలో పర్యటించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనం, ఎంఈఓ కార్యాలయం వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అధికారులు పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో రెవున్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో పీ4 సర్వే జాబితాలు

తుని రూరల్: ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజా భాగస్వామ్యం (పీ4) సర్వే లబ్ధిదారుల జాబితాలను మండలంలో అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించినట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ తెలిపారు. మూడు రోజుల పరిశీలన అనంతరం ఈ నెల 24న అన్ని గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే గ్రామసభల్లో రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సర్వే జాబితాలను ప్రదర్శించినట్టు ఎంపీడీఓ వివరించారు.

స్పీకింగ్ స్కిల్స్‌తో విజయాలు

గండేపల్లి: స్పీకింగ్ స్కిల్స్‌తో విజయాలు సాధించవచ్చునని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి. కృష్ణారావు అన్నారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం టోస్ట్మాస్టర్స్ ఇంటర్నేషనల్ ఏరియా ఐ–1 కాంటెస్ట్‌లో భాగంగా ఇంటర్నేషనల్ స్పీచ్ కాంటెస్ట్, టేబుల్ టాపిక్ కాంటెస్ట్ నిర్వహించారు. టోస్ట్మస్టర్స్ పి.సాయి చరణ్ సింగ్, ఎస్.దత్త సాయిరాం, కేఎల్ఎల్ అమృత, సాయికృష్ణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, అకడమిక్స్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు వంకాయలపాటి సాయి, చిట్టిబాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక వాసవీ మహిళా మండలి, లలితా మహిళా మండలి సభ్యులు లలితా సహస్ర నామాలు, విష్ణుసహస్ర నామాలు, భగవత్ పారాయణ చేశారు. కార్యక్రమంలో తాళ్లూరి గొల్లాజీరావు, వూర నానాజీ, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.